రేవంత్‌రెడ్డికి పొంగులేటి చెక్!?

మొదటిపేజీ తరువాయి...

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఎంతగానో ప్రయత్నించినట్టు పార్టీ అంతర్గత వర్గాల సమాచారం. అయినప్పటికీ వాళ్లందరి అభిప్రాయాన్ని కాదని అధిష్ఠానం పొంగులేటి వియ్యంకుడికి టికెట్ ఇవ్వడం రాష్ట్ర పార్టీలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకఛత్రాధిపత్యానికి చెక్ పెట్టడమేనని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామం సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ భవిష్యత్‌కు ఓ హెచ్చరిక లాంటిదనే చర్చ జోరుగా జరుగుతున్నది.

రేవంత్‌రెడ్డి గురి రివర్స్ అయిందా?

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకురావడంలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. పార్టీలో తనకు కొరకరాని కొయ్యగా మారిన సీనియర్ నేత భట్టి విక్రమార్కకు చెక్ పెట్టేందుకే పొంగులేటిని తీసుకొచ్చారనే చర్చ అప్పట్లో జరిగింది. ఆ ప్రయత్నమే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి రివర్స్ అయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనకు పోటీగా ఉన్న భట్టిని తప్పించాలని పొంగులేటిని తీసుకొస్తే.. ఇప్పుడు ఆయన భట్టిని మించి పోటీగా తయారయ్యారనే చర్చ జరుగుతున్నది. పొంగులేటిని పార్టీలో హైలెట్ చేయడం రేవంత్‌రెడ్డి చేసిన వ్యూహాత్మక తప్పిదమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో పొంగులేటి అడుగులను గుర్తించడంలో రేవంత్ విఫలమయ్యారనే చర్చ కూడా జరుగుతున్నది. అది తెలుసునేసరికే పరిస్థితి 'చేయి' దాటిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పొంగులేటి 'భవిష్యత్తు'కు బాటలు !

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచే తన 'భవిష్యత్తు'కు బాటలు వేసుకుంటున్నారనే ప్రచారం జరిగింది. అందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల్లో 'తన' వారికి టికెట్లు ఇప్పించి గెలిపించుకున్నారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ టికెట్ల విషయంలో తన రాజకీయ చతురతను ప్రదర్శించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటు రాష్ట్రంలోనూ, అటు ఢిల్లీలోనూ బలంగా ఉండాలని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇక్కడ పార్టీలో విధేయుడిగా ఉంటూనే.. ఢిల్లీకి గురిపెట్టారనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న పొంగులేటి ఢిల్లీలోనూ తనకంటూ ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకొనే పనిలో ఉన్నట్టు తెలిసింది. గతంలో ఎంపీగా పనిచేసిన అనుభవం, ఢిల్లీస్థాయిలో తన పరిచయాలు, పార్టీ అధిష్ఠానం వద్ద తన లాబీయింగ్, ఆర్థిక బలం ఇలా అన్నీ వినియోగించి ఎంపీ టికెట్ కోసం ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పినట్టు సమాచారం. పొంగులేటి కుటుంబీకులకు టికెట్ వచ్చి ఢిల్లీకి వెళితే అసలుకే మోసం వస్తుందని భావించిన సీఎం రేవంత్, భట్టి, తుమ్మల సాధ్యమైనంత మేరకు అడ్డుకొనేందుకు ఆనేక ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే మండవ వెంకటేశ్వరరావుతోపాటు మరికొందరి పేర్లను తెరపైకి తీసుకొచ్చారనే ప్రచారం జరిగింది. పార్టీలో కీలక నేతలంతా వ్యతిరేకిస్తున్నా... పొంగులేటి తన వాళ్లకు టికెట్ ఇప్పించుకోగలిగారు. ఇలా ఢిల్లీ స్థాయిలో చక్రం తిప్పడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ పరిణామాలైనా జరిగేందుకు ఆస్కారం ఉందనే చర్చ జరుగుతున్నది. స్వతహాగా పెద్ద వ్యాపారవేత్త అయిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికంగా బలవంతుడనే విషయం అందరికీ తెలిసిందే. దీనికి తోడు వివిధ స్థాయిల్లో సంబంధాలు నెరపగల చాకచక్యం ఆయన సొంతం. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో ఏం జరుగుతుందోననే అనుమానాలు పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నాయి.

రేవంత్ ఏకఛత్రాధిపత్యానికి గండి!

అటు అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటు ఎంపీ ఎన్నికల్లో తాను సిఫారసు చేసిన అభ్యర్థులకు టికెట్లు ఇప్పించడంలో సీఎం రేవంత్‌రెడ్డి అనుకున్నది సాధించారనే అభిప్రాయాలున్నాయి. ఇందులో భాగంగానే మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి, వరంగల్, మెదక్, నాగర్‌కర్నూల్‌లో 'తన' అనుకున్నవారికి రేవంత్ టికెట్లు ఇప్పించుకున్నారనే అభిప్రాయాలున్నాయి. ఒక్క ఖమ్మం టికెట్ విషయంలోనే ఆయనకు భంగపాటు తప్పలేదని అంటున్నారు. ఈ ఒక్క సీటులో మాత్రం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రూపంలో రేవంత్‌రెడ్డికి చెక్ పడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో రేవంత్‌రెడ్డి ఏకఛత్రాధిపత్యానికి ఖమ్మం టికెట్ గండి కొట్టిందనే చర్చ పార్టీలో జోరుగా జరుగుతున్నది. ఇది భవిష్యత్తులో ఎక్కడికి దారితీస్తుందోనని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.



బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫొటోతో ముద్రించిన పెండ్లి పత్రిక

బీజేపీ కార్యకర్త అత్యుత్సాహం

- పెండ్లి పత్రికపై మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫొటో ముద్రణ
- కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేసిన పోలీసులు

నర్సాపూర్, ఏప్రిల్22: బీజేపీకి చెందిన ఓ కార్యకర్త అత్యుత్సాహం ప్రదర్శించారు. ఏకంగా పెండ్లి పత్రికపై బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫొటోను ముద్రించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో సోమవారం వెలుగుచూసింది. కౌడిపల్లి మండలం కొత్త చెర్వు తండా, మహ్మద్‌నగర్ గేటు తండాకు చెందిన సునావత్ సురేశ్‌నాయక్ బీజేపీ కార్యకర్త. ఆయన తన తమ్ముడి పెండ్లి పత్రికపై.. 'మా తమ్ముడి పెండ్లికి మీరు ఇచ్చే బహుమతి.. రఘునందన్‌రావుకు మీరు వేసే ఓటు' అంటూ రాయడంతో పాటు బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఫొటో ముద్రించారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి చంద్రయ్య కౌడిపల్లి మండల ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఎన్నికల సమయంలో ఎంపీ అభ్యర్థి ఫొటోతోపాటు ఓటు వేయాలని ముద్రించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని ఎస్సై వివరించారు.

కాంగ్రెస్‌లో రేవంత్ 'సీఎం' చిచ్చు

- వెంకట్‌రెడ్డికి వంతపాడిన రేవంత్
- సీఎం అర్హత ఆయనకే ఉందని వ్యాఖ్య
- రేవంత్ వ్యాఖ్యలపై సీనియర్ల గుర్రు
- భట్టి, ఉత్తమ్, జానా సంగతేంటని ప్రశ్న
- రాజకీయ వర్గాలలో హాట్ టాపిక్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): 'వాస్తవంగా నాతోపాటు ఎవరికైనా సీఎం పదవికి అర్హత ఉందంటే అది కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే' అంటూ భువనగిరి ఎన్నికల ప్రచారసభలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో దుమారానికి కారణమయ్యాయి. నాయకులెవరూ బహిరంగంగా స్పందించకపోయినప్పటికీ లోలోనమాత్రం ఉడికిపోతున్నారు. రేవంత్‌ను సమర్థించేవారు ఈ వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకుంటున్నప్పటికీ సీనియర్ నేతలైన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీనియర్ నాయకులు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి వంటివారు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి భట్టి పాదయాత్ర కూడా దోహదం చేసింది. ఈ నేపథ్యంలో సీఎం పదవి కోసం చివరి క్షణం వరకు ఆయన పోటీపడ్డారు. చివరికి రాజకీయ పరిస్థితులు, సమీకరణల దృష్ట్యా ఆ పదవి చివరికి రేవంత్‌రెడ్డిని వరించింది. భట్టికి డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టారు. ఈ విషయంలో భట్టి భార్య నందిని బాహటంగానే తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇలాంటి పరిస్థితుల్లో వెంకటరెడ్డే సీఎం పదవికి అర్హుడని రేవంత్ చెప్పడం పుండుమీద కారం చల్లినట్టు అయింది. దీనికితోడు ఇటీవల జరుగుతున్న పరిణామాలు భట్టిని అవమానించేలా ఉంటున్నాయని ఆయన సన్నిహితులు చెప్తున్నారు. రేవంత్ తన వ్యాఖ్యల ద్వారా భట్టికి సీఎం అయ్యే అర్హత లేదని పరోక్షంగా చెప్పారంటూ సీనియర్ నేతలు, ఆయన అనుచరులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

అప్పుడు ఉత్తమ్ సీఎం అన్నారు

నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేతల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒకరు. గతంలో ఆయన పీసీసీ చీఫ్‌గా పనిచేశారు. గత ఎన్నికల్లో ఆయనే సీఎం అభ్యర్థి అన్న ప్రచారం కూడా జరిగింది. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన తర్వాత సీఎం పదవిని ఆశిస్తున్న వారిలో ఆయన పేరు కూడా వినిపించింది. మరో సీనియర్ నేత జానారెడ్డి కూడా సీఎం అయ్యే అర్హత ఉందన్నది అందరూ అంగీకరించే విషయమే. ఇంతమందిని కాదని వెంకట్‌రెడ్డి ఒక్కరికే ఆ అర్హత ఉందంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లోనే కాదు, పార్టీలోనూ హాట్ టాపిక్ అయ్యాయి.

కొండాకు రూ. 4 వేల కోట్ల ఆస్తి

- నామినేషన్ సందర్భంగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డి వెల్లడి

రంగారెడ్డి, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ): చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన ఆస్తులు రూ. 4వేల కోట్లుగా వెల్లడించారు. నామినేషన్ దాఖలు సందర్భంగా సోమవారం అఫిడవిట్‌లో తన కుటుంబ ఆస్తుల వివరాలను ప్రకటించారు. కొండా పేరిట రూ.1,178.72కోట్లు, సతీమణి సంగీతారెడ్డి పేరిట రూ.3,203.9కోట్లు, కుమారుడు విరాట్ మాధవ్ రెడ్డి పేరిట రూ.107.44కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భూములు, భవనాల విలువ రూ.71.35కోట్లుగా తెలిపారు. రూ.1.76కోట్ల అప్పులున్నాయని వెల్లడించారు. తనకు కారు లేదని, 4 కేసులు ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

- రైతు కుటుంబాన్ని పరామర్శించిన సిరికొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని బూర్నపల్లికి చెందిన రైతు కొండ రమేశ్ తన పంట పొలం ఎండి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోగా సోమవారం ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. రైతు చిత్రపటానికి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వం రైతుబీమాతోపాటు రూ.25 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సిరికొండ డిమాండ్ చేశారు. – టేకుమట్ల

కొండా సురేఖపై చర్యలకు ఈసీని ఆదేశించండి

- హైకోర్టులో దాసోజు శ్రవణ్ పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై చర్యలు చేపట్టేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేయాలని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కుమార్ సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంతో కేటీఆర్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన పాత్ర ఉన్నట్టు సురేఖ గత నెల 16న విలేకరుల సమావేశంలో ఆరోపించారని, పైపెచ్చు కేటీఆర్‌ను జైలుకు పంపిస్తామని అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టాలన్న కుట్రతో ఆమె కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలతో ఈసీ మార్గదర్శకాలను ఉల్లంఘించారని వివరించారు. దీనిపై ఈ నెల 8న తాము చేసిన ఫిర్యాదును కేంద్ర ఎన్నికల సంఘం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు పంపడాన్ని ఎన్నికల నిబంధనలకు విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు.

4 నెలల్లోనే తెలంగాణ ఆగం

మొదటిపేజీ తరువాయి...

రూ.4 వేలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చారని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో సాగునీటి కష్టాలు పోయాయని, అప్పుడు నిండుకుండలా ఉన్న జలాశయాలు ఇప్పుడు ఎండిపోయి దర్శనమిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్ముకుంటే నట్టేట ముంచుతాయని హెచ్చరించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా - ఉద్యోగ సమాచారం

టెట్ రాయనున్న 48 వేల మంది టీచర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది టెట్‌ను 48,582 పంతుళ్లు రాయనున్నారు. పేపర్ –1కు 9,756, పేపర్ –2కు 38,826 (గణితం – 22,369, సోషల్‌స్టడీస్ –16,457) మంది టీచర్లు దరఖాస్తు చేశారు. శనివారం టెట్ దరఖాస్తు గడువు ముగియగా, మొత్తం 48,582 దరఖాస్తులొచ్చాయి. వీరంతా టెట్‌లో అర్హత సాధించేందుకు నిరుద్యోగ అభ్యర్థులతో సమానంగా కుస్తీపట్టనున్నారు.

నిజంగా పరీక్షే..

టెట్ సిలబస్, మారిన ప్రశ్నపత్రాల సరళి నేపథ్యంలో నిజంగా పంతుళ్లకు పరీక్షే అని చెప్పవచ్చు. ఇప్పుడు టెట్ రాస్తున్నవారంతా 8–10 పదేండ్ల క్రితం నియమితులయ్యారు. మరికొంత మంది 25 ఏండ్లకు పైగా సర్వీసును పూర్తి చేసుకొన్నవారున్నారు. ఇటీవలి టెట్ ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉంది. నిరుడు పేపర్–1లో 36శాతం, పేపర్–2లో కేవలం 15శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదైంది. పేపర్ –2లో ఇప్పటి వరకు నమోదైన అత్యధిక ఉత్తీర్ణత 49 శాతం మాత్రమే. గతంలో 19, 25, 28శాతం చొప్పున ఉత్తీర్ణత వచ్చింది. టెట్ పాసైతేనే పదోన్నతి లభించే అవకాశం ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో టీచర్లు టెట్ కొరకు కష్టపడుతున్నారు. ఎస్‌ఏ జీవశాస్త్రం ఉపాధ్యాయులు గణితంలో 60 మార్కులకు టెట్ పరీక్ష రాయాల్సి ఉన్నది. అదే సైన్స్ కంటెంట్‌లో ఫిజిక్స్, రసాయన శాస్త్రాలుండగా, వీటిలో 24 మార్కులే ఉన్నాయి. సాంఘిక శాస్త్రం పేపర్ రాసే వారు ఇంగ్లిష్ 30 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉన్నది.

ఇంటర్ ఫలితాలకు అడ్డొచ్చిన మంగళ వారం?

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫలితాలు బుధవారం ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి శృతి ఓజా ప్రకటించారు. ఫలితాలను మంగళవారమే విడుదల చేయాలని భావించారు. ఓ ఉన్నతాధికారి సెంటిమెంట్‌గా భావించి మంగళవారం కుదరదని చెప్పినట్టు తెలిసింది. దీంతో బుధవారం ఒకేసారి ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదల చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 28 నుంచే పరీక్షలు ప్రారంభం కాగా, ఇంటర్ ఫస్టియర్‌లో 4,78,718 మంది, సెకండియర్‌లో 5,02,260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సెకండియర్‌లో మరో 58,071 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాశారు. విద్యార్థులు ఫలితాల కొరకు https://tsbie.cgg.gov.in, http://results.cgg.gov.in వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించారు. నమస్తే తెలంగాణకు సంబంధించి www.ntnews.com, www.telanganatoday.com వెబ్‌సైట్‌లలో ఫలితాలు తెలుసుకోవచ్చు.

నెలాఖరులో 'పది' ఫలితాలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ): పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెలాఖరులో విడుదలకానున్నాయి. ఈ నెల 29న లేదా 30న ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. జవాబుపత్రాల మూల్యాంకనం ఈ నెల 13నే ముగిసింది. మార్కుల నమోదు సహా క్రోడీకరణ పనులు కూడా ఇప్పటికే పూర్తిచేశారు.

ఎండల తీవ్రతతో సమ్మర్ స్పోర్ట్స్ మీట్ వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ): ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి క్రీడా శిబిరాలను జూన్ 15కు వాయిదా వేసినట్టు ఎస్సీ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. ముందుగా, ఈ నెల 24 నుంచి మే 8 వరకు వేసవి క్రీడా శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించారు. తీవ్రమైన ఎండల కారణంగా సమ్మర్‌స్పోర్ట్ మీట్‌ను వాయిదా వేయాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి దయాకర్ ఇటీవల సొసైటీ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సెక్రటరీ తాజాగా వేసవి శిబిరాలను వాయిదా వేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఎంపికచేసిన కేంద్రాల్లో 15రోజుల పాటు 6,7,8వ తరగతికి చెందిన 1,280 మందికి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే.

27 లేదా మే 1న 'దోస్త్' నోటిఫికేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు నిర్వహించే 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ' (దోస్త్) నోటిఫికేషన్ ఈ నెల 27 లేదా మే 1న విడుదలకానున్నది. దోస్త్ రిజిస్ట్రేషన్ మే 1 లేదా 6 నుంచి ప్రారంభంకానున్నది. బుధవారం ఇంటర్ ఫలితాలు విడుదలకానున్న నేపథ్యంలో అధికారులు షెడ్యూల్‌ను రూపొందించారు. మొత్తం మూడు విడతల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలో 1,054 డిగ్రీ కాలేజీలుండగా, వీటిల్లో 3.86 లక్షల సీట్లున్నాయి.

జేఎల్ తుది కీ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : జేఎల్ రాత పరీక్ష తుది 'కీ' టీఎస్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. జేఎల్ పోస్టుల భర్తీకి నిరుడు సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 1వరకు రాత పరీక్షలను నిర్వహించగా, గతంలోనే ప్రాథమిక కీ విడుదలైంది. వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సూచించారు.

జేఈఈ మెయిన్ -2 ఫైనల్ కీ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : జేఈఈ మెయిన్ –2 పరీక్షల తుది కీ విడుదలైంది. ఏప్రిల్ 4 నుంచి 12 వరకు నిర్వహించిన రెండో సెషన్ తుది కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సోమవారం విడుదల చేసింది. సెషన్ –2కు 12.57లక్షల మంది దరఖాస్తు చేసుకొన్నారు. గత ఫిబ్రవరిలో జేఈఈ మెయిన్ –1 నిర్వహించారు. ఈ రెండు పరీక్షలకు హాజరైన విద్యార్థులు సాధించిన మెరుగైన స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ఎన్టీఏ మెరిట్‌లిస్టును విడుదల చేస్తుంది. తుది ఫలితాలు విడుదలైన తర్వాత 2.5లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు.

టీటీసీ ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) ఫలితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలకు 14,329 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోగా, 8,508 (87%) మంది ఉత్తీర్ణులైనట్టు విభాగం డైరెక్టర్ కృష్ణారావు ప్రకటించారు. 42 రోజుల టీటీసీ కోర్సులో మే 23 నుంచి 30 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. మే 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. దరఖాస్తులు డీఈవో కార్యాలయాల్లో లభిస్తాయని తెలిపారు.

రామారెడ్డిలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పోస్టుకార్డులను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాలతోపాటు రైతులు

కాంగ్రెస్ సర్కారుపై 'పోస్టుకార్డు' పోరు

- హామీల అమలు ఎప్పుడంటూ రేవంత్‌కు ప్రశ్నలు
- సీఎంవో కార్యాలయానికి అన్నదాతల ఉత్తరాలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ)/రామారెడ్డి/భైంసా/పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపై రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఎంవో కార్యాలయానికి సోమవారం అన్నదాతలు ఉత్తరాలు రాశారు. కామారెడ్డి జిల్లా రామారెడ్డిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ రైతులతో సమావేశమయ్యారు. వరికి రూ.500 బోనస్, కౌలురైతుకు రైతుబంధు, రుణమాఫీ ఎప్పుడు అమలుచేస్తారంటూ రైతులు సీఎంవో కార్యాలయానికి ఉత్తరాలను పంపారు. ఆదిలాబాద్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు పంపారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా వంటి అంశాలను ఉత్తరాల్లో పేర్కొన్నట్టు తెలిపారు. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన రైతు నర్సయ్య, నాగరాజు, పుండలిక్ సీఎంకు ఉత్తరాలు రాశారు. 'అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మాటిచ్చి మోసం చేసిన రేవంత్ సర్కారుపై పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించాం. ఆరు గ్యారెంటీలు ఎప్పుడు అమలు చేస్తారు? అంటూ 5 వేల పోస్టులు సీఎంకు పంపాం. నేటి నుంచి పెద్దపల్లి పార్లమెంట్ సెగ్మెంట్‌లోని గ్రామ గ్రామాన పోస్టు కార్డు ఉద్యమం ఉధృతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాం' అని బీఆర్‌ఎస్ పెద్దపల్లి లోక్‌సభ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. పెద్దపల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఆగమే..

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మోసకారి మాటలు నమ్మొద్దు
- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల టౌన్/ఆత్మకూరు/ధన్వాడ/మదనాపురం, ఏప్రిల్ 22 : కాంగ్రెస్, బీజేపీలు దొందూదొందేనని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ఈ రెండు పార్టీలు చెప్పే మాయమాటలు విని ప్రజలు ఆగం కావొద్దని సూచించారు. కాంగ్రెస్ అబద్ధ హామీల ప్రచారాన్ని నమ్మి ప్రజలు ఓట్లేసి గెలిపించి ఇప్పుడు బాధపడుతున్నారని తెలిపారు. అధికారం కోసం నోటికొచ్చినట్టు హామీలిచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, నారాయణపేట జిల్లా ధన్వాడ, వనపర్తి జిల్లా ఆత్మకూరు, మదనాపురంలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు జరిగాయి. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. మళ్లా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఐదేండ్లలో పాలమూరు ప్రాజెక్టు పూర్తి చేసి సాగునీళ్లు పారిచ్చేదని తెలిపారు. ఎన్నో కంపెనీలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించేటోళ్లమని చెప్పుకొచ్చారు.

ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికలు ముగిశాక కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు గుడ్‌బై చెప్పడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏ రోజూ తెలంగాణ గురించి మాట్లాడలేదని గుర్తుచేశారు. ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జాతీయహోదా ప్రకటించిన కేంద్రం తెలంగాణలోని కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 26న పాలమూరుకు కేసీఆర్ వస్తున్నారని, పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌వి ఉత్తమాటలే..

- ఎండగట్టిన మహిళా కూలీ
- బీఆర్‌ఎస్ మీటింగ్‌లో మైక్ పట్టుకొని కాంగ్రెస్ పార్టీని ఉతికి ఆరేసిన కూలీ మంగమ్మ

నారాయణపేట జిల్లా ధన్వాడలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆ పార్టీ కార్యకర్త మంగమ్మ

ధన్వాడ, ఏప్రిల్ 22 : 'కాంగ్రెస్ మోసపూరిత పార్టీ. ప్రజలను నమ్మించి మోసం చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.4 వేల పింఛన్, మహిళలకు నెలకు రూ.2,500, ఇలా ఆరు గ్యారెంటీలని ప్రజలను మోసం చేసింది' అని నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన మహిళా కూలి కార్యకర్త వడ్డె మంగమ్మ విరుచుకుపడ్డారు. సోమవారం ధన్వాడలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అటుగా వెళ్తున్న ఆమె బీఆర్‌ఎస్ మీటింగ్‌లోకి వచ్చి మైకు తీసుకొని మాట్లాడుతూ కాంగ్రెస్ పనితీరును ఎండగట్టింది. ఆరు గ్యారెంటీల్లో కేవలం ఉచిత బస్సు ప్రయాణమే అందుబాటులోకి వచ్చిందని, ఇదొక్కటి ఇస్తే సరిపోతదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఫ్రీ కరెంట్ ఇవ్వడం లేదని, చెప్పిన పనులు చేస్తలేదని, ఇలాంటి కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో మల్లెట్లా ఓట్లేయాలి? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బయటపడిందని, మోసం చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

బీజేపీ అభ్యర్థి మాధవీలతను ఆలింగనం చేసుకుంటున్న ఏఎస్సై ఉమాదేవి

బీజేపీ అభ్యర్థితో ఏఎస్సై ఆలింగనం

- సస్పెండ్ చేసిన సీపీ

సైదాబాద్, ఏప్రిల్ 22: ఎన్నికల ప్రచారంలో బీజేపీ అభ్యర్థిని ఆలింగనం చేసుకొన్న ఓ మహిళా ఏఎస్సైని సస్పెండ్ చేస్తూ నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం సాయంత్రం ఐఎస్ సదన్ డివిజన్‌లోని వినయ్‌నగర్‌కాలనీలో హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొంపల్లె మాధవీలత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార బందోబస్తు విధులు నిర్వహిస్తున్న సైదాబాద్ పీఎస్‌కు చెందిన ఏఎస్సై ఉమాదేవి.. మాధవీలతతో కరచాలనం చేసి, ఆలింగనం చేసుకొన్నారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి కూడా వెళ్లాయి. దీంతో ఆయన ఏఎస్సై ఉమాదేవిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ వేదికపై విద్యుత్తు ఉద్యోగి

- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి అభ్యర్థి గడ్డం వంశీకి ప్రచారం

పెద్దపల్లి, ఏప్రిల్22 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని బృందావన్ గార్డెన్‌లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలువురు కార్మిక నాయకులతోపాటు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ ఎంఆర్‌టీ డివిజన్‌లో టెస్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న తులసి కూడా పాల్గొన్నారు. అంతేకాదు.. కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతోపాటు మంత్రి శ్రీధర్‌బాబుతో వేదికను పంచుకొని ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. ఈ ఘటనపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి.. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా నిర్వహించిన సభావేదికను పంచుకోవడం ప్రభుత్వ ఉద్యోగుల క్రమశిక్షణారాహిత్యానికి నిదర్శనమని చెప్తున్నారు. ఇటీవల సిద్దిపేటలో కేవలం ఒక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో వందకు పైగా ఉద్యోగులను సస్పెండ్ చేసిన ఈసీ.. ఈ ఘటనపై ఎలా స్పందిస్తుందో చూడాలని పలువురు పేర్కొంటున్నారు.



పెద్దపల్లి గోదావరిఖనిలో ఐఎన్‌టీయూసీ మీటింగ్‌లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో వేదికను పంచుకున్న టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ ఉద్యోగి తులసి (వృత్తంలో)

మాదిగలను అణగదొక్కుతున్న సీఎం: వంగపల్లి



ముషీరాబాద్, ఏప్రిల్ 22: మాదిగలకు లోక్‌సభ సీట్లు కేటాయించకుండా, సీఎం రేవంత్‌రెడ్డి వారిని రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ఆరోపించారు. సోమవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలోఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క లోక్‌సభ ఎంపీ సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లూరి వెంకట్, నర్సింహ, రాజేశ్, శ్యామ్‌రావు, వెంకట్, నాగరాజు, ప్రవీణ్, రమేశ్, రఘు పాల్గొన్నారు.